పట్టణ ప్రజలకు 'యోగం'

- రూ.30 లక్షల వ్యయంతో భవన నిర్మాణం
- తుది దశకు చేరుకున్న పనులు

కైలాస్‌నగర్: యాంత్రీకంగా మారిన ప్రస్తుత జీవన విధానంలో మనిషి తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. శరీర శ్రమకు తగు ప్రాధానత్యనివ్వకపోవడంతో బీపీ, షుగర్ వంటి దీర్ఘకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ఫలితంగా జీవితాంతం మెడిసిన్‌తో గడపాల్సిన దుస్థితి. ఇలాంటి పరిస్థితుల్లో పట్టణ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడే దిశగా ఆదిలాబాద్ బల్దియా ప్రత్యేక దృష్టి సారించింది. ఆరోగ్య సంరక్షణలో భాగంగా యోగాసాలను ఆచరించేందుకు వీలుగా ప్రత్యేకంగా యోగా భవనాన్ని నిర్మిస్తోంది. ఈ భవనం పనులు తుదిదశకు చేరాయి. వచ్చే నెలలో దీన్ని ప్రజలకు అందుబాటులో తెచ్చేదిశగా బల్దియా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

రూ.30 లక్షల వ్యయంతో యోగా భవన్

పట్టణ ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ఆదిలాబాద్ మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. అందుకు ఉపయోగపడే విధంగా జిల్లా కేంద్రంలోని ద్వారాకనగర్‌లో ప్రయోగాత్మకంగా రూ.30 లక్షల వ్యయంతో ప్రత్యేక యోగా భవన్‌ను నిర్మించారు. గతేడాది దీని పనులు ప్రారంభించగా ప్రస్తుతం భవన నిర్మాణం దాదాపు పూర్తయింది. చిన్నపాటి తుదిదశ పనులు చేపట్టాల్సి ఉంది. వచ్చే నెలలో ఆ పనులను సైతం పూర్తి చేసి మార్చి రెండో వారంలో పట్టణ ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేదిశగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ యోగాభవన్‌ను అందుబాటులోకి తేవడం ద్వారా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరే అవకాశముంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతోపాటు స్థానిక కాలనీవాసులు ఏదైనా సమావేశాలు నిర్వహించుకోవాలన్నా ఈ భవనం మంచి వేదికగా కానుంది.



ద్వారాకనగర్‌లో నిర్మించిన యోగా భవన్

త్వరలో అందుబాటులోకి..



మున్సిపల్‌కు సంబంధించిన స్థలం అందుబాటులో ఉండటంతో ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో యోగా భవన్‌ను నిర్మించాం. భవన నిర్మాణం పూర్తయింది. రంగులు వేయాల్సి ఉంది. ఈ పనులు త్వరలో పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం. ఉదయం యోగాసనాలు ఆచరించేందుకు ఉపయోగపడుతుంది. కాలనీవాసులు చిన్న, చిన్న శుభకార్యాలు, సమావేశాలు నిర్వహించేందుకు సైతం వేదికగా మారుతోంది. మార్చి రెండో వారంలో దీన్ని ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.

– జోగు ప్రేమేందర్, మున్సిపల్ చైర్మన్

క్లుప్తంగా

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్‌ను కలిసిన నేతలు



వినోద్‌కుమార్‌కు భగవాన్ బాబా చిత్రపటాన్ని అందజేస్తున్న అధ్యక్షుడు వెంకట్

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్‌ను వంజరా సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ ముండే శుక్రవారం హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రస్తుతం బీ,సీ,డీలో ఉన్న వంజరాలకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి తమవంతు ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వంజరా నాయకుడు గణేశ్, తదితరులు ఉన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు అందజేస్తున్న కాంబ్లె ఉదయ్

నార్నూర్: విద్యార్థుల చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అన్నాబావు సాఠె జిల్లా కమిటీ అధ్యక్షుడు కాంబ్లె ఉదయ్ అన్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు దివంగత డీసీసీబీ చైర్మన్ కాంబ్లె నాందేవ్ స్మారకార్థం శుక్రవారం పరీక్ష ప్యాడ్లు, పెన్నులు ఉచితంగా పంపిణీ చేశారు. మొత్తం 263 మంది పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ చిన్నప్పారెడ్డి, అన్నాబావు సాఠె మండల కమిటీ అధ్యక్షుడు కొర్రెల్ల మహేందర్, కార్యదర్శి రాజు, బీఆర్ఎస్ నాయకుడు రాజన్న,పీఏసీఎస్ డైరెక్టర్లు రాము, కేశవ్ ఉన్నారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ

బోథ్: మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్యకేంద్రాన్ని ఎంపీపీ తుల శ్రీనివాస్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సౌకర్యాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సూపరింటెండెంట్ ఆసుపత్రిలో లేకపోవడంతో ఉన్నతాధికారులకు ఫోన్ ద్వారా తెలియజేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండకుండా ప్రైవేట్ ఆసుపత్రిలో ఉన్నాడని పేర్కొన్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్ రవీంద్రప్రసాద్‌ను సంప్రదించగా తాను రెండు రోజుల పాటు సెలవులో ఉన్నానని తెలిపారు.

నేడు ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం ఎన్నికలు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ ప్రజారోగ్య వైద్యుల సంఘం జిల్లా కార్యవర్గ ఎన్నికలు శనివారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణ రిటర్నింగ్ అధికారులుగా డాక్టర్ ప్రవీణ్ కుమార్, సహాయ రిటర్నింగ్ అధికారులుగా డాక్టర్ టి.కిరణ్, డాక్టర్ మజీద్‌ను నియమించినట్లు పేర్కొన్నారు.

రేపు అన్నబావు సాఠే విగ్రహావిష్కరణ

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆదివారం అన్నబావు సాఠే విగ్రహావిష్కరణ కార్యక్రమం ఉంటుందని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన అన్నబావు సాఠే విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులతో కలిసి కరపత్రాలను విడుదల చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ విగ్రహ ఆవిష్కరణకు ప్రజలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఎంపీటీసీ శివకుమార్‌రెడ్డి, విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు సిరిసిల్ల భూమయ్య, గణేశ్, కాశిపాక విష్ణు, బత్తుల అశోక్, జన్నారపు సాహెబ్‌రావు, సిడాం మురళి తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పౌష్టికాహారం అందిస్తాం

నేరడిగొండ: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మంజుల అన్నారు. మండలంలోని లింగట్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సర్పంచ్ సాబ్లే స్వర్ణాంజలితో కలిసి శుక్రవారం అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కొర్టికల్(బి), లంబాడితండా, చింతగూడ అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

రేపు బీసీ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఆదిలాబాద్‌రూరల్: ఇటీవల నూతనంగా ఎన్నికైన బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారమహోత్సవం కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవనంలో ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ అన్నారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్, ఎంపీ సోయం బాపూరావ్, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావ్, రేఖానాయక్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌తోపాటు డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, సుహాసినిరెడ్డి, కంది శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌టీపీ నాయకుడు అనిల్ కుమార్, డాక్టర్ రవికిరణ్ యాదవ్ హాజరవుతారని అన్నారు. బీసీ కార్యవర్గ సభ్యులు, కులస్తులు పాల్గొనాలని కోరారు.

బీసీ అనుబంధ సంఘాల అడహక్ కమిటీ నియమాకం

బీసీ సంక్షేమ సంఘం అనుబంధ సంఘాల అడహక్ కమిటీ కన్వీనర్లు, కోకన్వీనర్లను నియమించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలాల శ్రీనివాస్ తెలిపారు. మహిళా విభాగం కన్వీనర్‌గా బియ్యాల అనుసూయ, ఉమామహేశ్వరి, కన్నాల లక్ష్మి కోకన్వీనర్‌గా నియమితులయ్యారు. ఉద్యోగ సంఘం కన్వీనర్‌గా జక్కుల శ్రీనివాస్, కోకన్వీనర్‌గా నర్ర నవీన్ యాదవ్, యువజన విభాగం కన్వీనర్‌గా తోకల నరేశ్, కో కన్వీనర్లుగా లంక కార్తీక్, ప్రఫుల్ యాదవ్, టి.రమణ, రవీందర్, సోమగారి అఖిల్, కార్తీక్, శివకుమార్, సురేందర్, విద్యాసాగర్ నియమితులయ్యారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం కోశాధికారి అంజయ్ కుమార్, ఉపాధ్యక్షుడు అశోక్, కన్వీనర్ ఆశమ్మ, ముఖ్య సలహాదారులు మోహన్ బాబు, రాజారెడ్డి, జాయింట్ సెక్రెటరీ యువరాజ్, నవీన్ యాదవ్, ప్రచార కార్యదర్శి రవీందర్, నర్సింగ్ పాల్గొన్నారు.

కల్యాణం కమనీయం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో శుక్రవారం వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబల కల్యాణం కమనీయంగా జరిగింది. ఆలయ ఆవరణలో నవగ్రహ, గణపతి పూజలు నిర్వహించి కల్యాణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు వేణుగోపాల్, గోవర్ధనచారి, సామన్‌పెల్లి సుదర్శన్, గట్టు మల్లేశ్, నరేందర్‌చారి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

బోథ్: మడలంలోని పొచ్చర గ్రామంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వివాహ మహోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

ఆదిలాబాద్: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నగేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పీహెచ్సీ కాలనీలో శుక్రవారం ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను మంజూరు చేస్తామని హామీలు ఇచ్చి ప్రస్తుతం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు నిలిచిపోతాయని, పెన్షన్లు అందవని నాయకులు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా సంక్షేమ పథకాలు మారవని, అందులోనూ బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెన్షన్లను పెంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు దినేష్ మటోలియా, మయూర్ చంద్ర, జ్యోతిరెడ్డి, కంది శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అయ్యనగారి భూమయ్య

రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు చరమగీతం

నేరడిగొండ: ప్రధాని మోదీ ప్రపంచానికే మార్గదర్శకం వహిస్తున్నారని పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యనగారి భూమయ్య అన్నారు. మండలంలోని వాంకిడి గ్రామంలో శుక్రవారం శక్తి కేంద్ర కార్నర్ మీటింగ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం నేరుగా పంచాయతీ అకౌంట్లో బడ్జెట్ విడుదల చేయగా అది కూడా ఎంపీడీవో వ్యవస్థ ద్వారా కేసీఆర్ ఎత్తుకెళ్లారని మండిపడ్డారు. మల్టీవర్కర్‌గా శుభ్రం చేస్తున్న కార్మికులకు కూలి పైసలు కూడా రాలేదని వాపోయారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలే బీఆర్ఎస్ పార్టీకి చరమగీతం పాడతారని అన్నారు. శక్తి కేంద్ర ఇన్‌చార్జి జాదవ్ పరశురాం, బూత్ అధ్యక్షుడు రాహుల్, పృథ్వీరాజ్, విష్ణు, సుభాష్, మండల ఇన్‌చార్జి మాధవరావు ఆమ్టే, మండల అధ్యక్షుడు సోసయ్య హీరాసింగ్, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవ్, పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, మండల అధ్యక్షుడు బక్రే లక్ష్మణ్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు ఉద్దల్ సింగ్, మైనార్టీ మోర్చా మండల అధ్యక్షుడు జమీర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు రాఘవులు పాల్గొన్నారు.

'ఖదీర్‌ఖాన్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి'

ఆదిలాబాద్‌రూరల్: ఖదీర్‌ఖాన్ మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి రత్నపురం రమేష్, జిల్లా అధ్యక్షుడు గడుగు మహేందర్ పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని సుందరయ్యనగర్ మసీద్ వద్ద శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. ఖదీర్‌ఖాన్ మృతికి కారణమైన వారిని సస్పెండ్ చేయడం కాదని, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం బాధిత కుటుంబ సభ్యులకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియాతోపాటు, మృతుడి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం, పిల్లల చదువు బాధ్యతలు, డబుల్ బెడ్రూం, ఎకరం భూమిని వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా మహిళా కన్వీనర్ ప్రేమకళ, ఆదిలాబాద్ అసెంబ్లీ అధ్యక్షురాలు మీనా, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పోశెట్టి, జిల్లా సెక్రెటరీ మిర్జా ఆరిఫ్ బేగ్, నాయకులు హరినాథ్, తులసి, కమల, మజీద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

ముగిసిన జాతర

తలమడుగు:మండలంలోని కుచులాపూర్‌లో సాయిబాబా ఆలయ 27వ వార్షికోత్సవం పురస్కరించుకుని గ్రామంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతర ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఎంపీపీ కల్యాణం లక్ష్మి రాజేశ్వర్, సర్పంచ్ ప్రభ పాల్గొని ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గ్రామవీధుల గుండా సాయిపల్లకిని ఊరేగింపు నిర్వహించారు. ఈ జాతరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు లక్ష్మీంపూర్, లింగి, పల్సి, సుంకిడి, లల్‌ఘడ నుంచి సాయిభక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన దుకాణాల వద్ద భక్తులతో సందడిగా మారాయి. గ్రామస్తులు రాజేశ్వర్, దేవ్‌రావు, రణవీర్, గంగారెడ్డి, రవీందర్, ప్రభాకర్, సదాశివ్, వామన్, దీపాక్, పోచ్చన్న, వెంకన్న, విశాల్ పంతులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

'ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే సహించేది లేదు'

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్నపై అసత్యపు ఆరోపణలు చేస్తే సహించేదిలేదని జైనథ్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మద్దుల ఊశన్న అన్నారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రతి నిత్యం ప్రజా శ్రేయస్సు, ప్రజల అభివృద్ధికి ఎమ్మెల్యే పాటుపడుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు లభిస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేకనే బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని అన్నారు. పార్టీలకతీతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. జైనథ్ మండలం అడ, కౌట, కరంజి, తరోడలో లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సంఘం నాయకులు సాములు, ప్రభాకర్, సురేఖ, రమేశ్, దిలీప్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మద్దుల ఊశన్న

గ్రామీణ క్రీడాకారులను వెలికితీస్తాం

నేరడిగొండ: గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభ వెలికితీసేందుకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండలంలోని వాగ్దారి గ్రామంలో శుక్రవారం వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తోందన్నారు. సర్పంచ్ గంగాదేవి, వీడీసీ అధ్యక్షుడు సోయం లక్ష్మణ్, వెంకటేశ్, నారాయణ, భీంరావ్, మారుతి, మురళీ, గంగాధర్ పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు మేనమామ సీఎం కేసీఆర్

- ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు

నేరడిగొండ: పేదింటి ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ మేనమామగా మారి కల్యాణలక్ష్మి రూపంలో కానుక అందజేస్తున్నారని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 60 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన 8 మందికి రూ.లక్షా 70 వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఆడపిల్ల పెళ్లికి కష్టం రావొద్దని మేనమామగా కేసీఆర్ రూ.1,00,116 కానుకగా ఇస్తున్నారని అన్నారు. దేశంలో ఎక్కడ లేనివిధంగా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, జెడ్పీటీసీ అనిల్, ఏఎంసీ చైర్మన్ రుక్మన్‌సింగ్, వైస్ చైర్మన్ సంజీవ్ రెడ్డి, సర్పంచ్ వెంకటరమణారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే

శ్రీదేవకినందన్ మహారాజ్‌ను కలిసిన ఎమ్మెల్యే

బజార్‌హత్నూర్: మండలంలోని మంజిరంతాండ గ్రామంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న భగవత్‌కథ పారాయణంలో ప్రవచన వక్త శ్రీదేవకినందన్ మహారాజ్‌ను ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్ శుక్రవారం కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. మాజీ ఎంపీ నగేష్, బీజేపీ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ నర్సయ్య, ఎంపీపీ జయశ్రీ ఉన్నారు.

సిరిచెల్మలో ప్రారంభమైన జాతర

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో శుక్రవారం మల్లన్న జాతర ప్రారంభమైంది. ఉదయం ఆలయంలో మల్లన్నకు ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులు జాతరను ప్రారంభించారు. వివిధ గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు మల్లన్నను దర్శించుకోవడానికి బారులు తీరారు. జాతర మొదటిరోజు దాదాపు 2 వేల మంది స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



మల్లన్న దర్శనానికి బారులు తీరిన భక్తులు

హీరాసుక జయంతి విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రాంలీల మైదానంలో ఈనెల 28న నిర్వహించే గోండి ధర్మ గురు హీరాసుక జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆదివాసీ పురోహిత్ ప్రధాన్ సమాజ్ సంఘం జిల్లా కార్యదర్శి సోయం రాందాస్ కోరారు. మండలంలోని కేస్లాపూర్, పిట్టబోంగరం, వాల్గొండ, వడగామ్ గ్రామాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా హీరాసుక జయంతి వేడుకల కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ హీరాసుక జయంతి వేడుకలకు ప్రతి గ్రామం నుంచి తరలిరావాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు గేడం భరత్, నాయకులు గేడం ఉమేష్, సోయం మురహరి, ఆత్రం హనుమంత్ రావ్, కనక రజినికాంత్, వెంకట్ ఉన్నారు.



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

ఆటల్లో గెలుపోటములు సహజం

బోథ్: ఆటల్లో గెలుపోటములు సహజమని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. తుల శ్రీనివాస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో లాల్‌పిచ్‌లో జరుగుతున్న క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ పోటీల్లో బోథ్ జట్టు విజయం సాధించింది, ద్వితీయ బహుమతి గుడిహత్నూర్, తృతీయ బహుమతి నేరడిగొండ జట్లు కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాస్‌ను యువకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండారి శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, అల్లకొండ ప్రశాంత్, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



బోథ్ జట్టుకు బహుమతి అందిస్తున్న ఎంపీపీ

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఇచ్చోడ: మండల కేంద్రంలో రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను సర్పంచ్ చౌహాన్ సునీత, ఉప సర్పంచ్ లోక శిరీష్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో శ్మశానవాటిక, కస్తూర్బా పాఠశాలకు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎంపీటీసీ జాహెద్, వార్డు సభ్యుడు సాబీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పకడ్బందీగా నిర్వహించాలి

బజార్‌హత్నూర్: వేసవిలో నిర్వహించనున్న ఉపాధిహామీ పనులు పకడ్బందీగా నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శులను డీఆర్‌డీవో కిషన్ ఆదేశించారు. ఎంపీడీవో సమావేశ మందిరంలో ఉపాధిహామీ, నర్సరీలో మొక్కల పెంపకం, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ ప్రతి జాబ్ కార్డుదారులకు పని కల్పించాలని, పని ప్రదేశంలో తాగునీరు, ప్రాథమిక వైద్యం పరికరాలు, మందులు అందుబాటులో ఉంచాలన్నారు. అలాగే టెంటు ఏర్పాటు చేయాలని, ఉదయం పనులు కల్పించాలన్నారు. నర్సరీలో మొక్కల సంరక్షణకు చలువ పందిర్లు ఏర్పాటు చేయాలని, చీడపీడల నివారణకు పురుగుమందులు పిచికారీ చేయాలన్నారు. సమావేశంలో ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి



ఈశ్వరిబాయిని సన్మానిస్తున్న మహిళలు

ఉట్నూర్‌రూరల్: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి అన్నారు. మండలంలోని కుమ్మరితాండలో వారం రోజులుగా జరుగుతున్న గోవింద్‌స్వామి సప్తాహ కార్యక్రమానికి శుక్రవారం ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక మహిళలు ఈశ్వరిబాయిని శాలువాతో సన్మానించారు. మాధవ్ మహరాజ్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఇంద్రవెల్లి: మండల కేంద్రానికి చెందిన ఈర్ల స్వామి ఇటీవల గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరిబాయి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అంతకుముందు ఈర్ల స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబానికి అండగా ఉంటామన్నారు. బాబా శ్యాం, శివ తదితరులు ఉన్నారు.

హనుమాన్ మందిరం ప్రారంభం

బోథ్: మండలంలోని నిగిని గ్రామంలో శుక్రవారం హనుమాన్ మందిరాన్ని వేదపండితులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలశ పూజ నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఇందులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్,, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్, బొజ్జ నారాయణ, గోవర్ధన్, అనిల్, రాజు, సాయి, పాటిల్, గ్రామపటేల్ పాల్గొన్నారు.

పాఠశాలకు ప్లేట్లు అందజేత

బోథ్: మండలంలోని పొచ్చర గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు భోజనం చేసేందుకు 50 ప్లేట్లను హనుమాన్‌రెడ్డి యూత్ సభ్యులు శుక్రవారం ఉపాధ్యాయులకు అందించారు. పాఠశాలకు అవసరమయ్యే వస్తువులను అందించడానికి సిద్ధంగా ఉన్నామని సభ్యులు తెలిపారు.

ఉత్తమ సేవలకు అవార్డు

బోథ్: మండలకేంద్రానికి చెందిన మాసం లక్ష్మి వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు అనిల్ కుమార్ ప్రగతి ఫౌండేషన్‌కు జాతీయ ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. ఈమేరకు ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ ఆరిఫ్ చేతుల మీదుగా శుక్రవారం స్థానిక బస్టాండ్ వద్ద ఆయన అందుకున్నారు. తన సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేసినందుకుగాను అవార్డు అందించినట్లు చైర్మన్ ఆరిఫ్ తెలిపారు. కార్యక్రమంలో శ్రీధర్, వీడీసీ అధ్యక్షులు గట్ల గంగాధర్, సాయన్న, నారాయణ, సభ్యులు ఉన్నారు.